డ్రగ్స్ సరఫరా ముఠాలను అణచివేస్తాం

సీపీ సుధీర్‌బాబు
- సమాజంలో మత్తు పదార్థాలకు స్థానం లేదు
- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచన



హ్యాండ్ బుక్ మాన్యువల్ విడుదల చేస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, పోలీస్ అధికారులు

నాగోలు: రాచకొండ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ రవాణా, వినియోగం మీద ఉక్కుపాదం మోపుతామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం నాగోలు పరిధిలోని బండ్లగూడలోని జీఎస్‌ఐ ఆడిటోరియంలో ఎన్డీపీఎస్ కేసుల ప్రొసీజరల్ ఎక్సలెన్స్ సెమినార్, వర్క్‌షాప్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ నుంచి పై స్థాయి అధికారులకు నిషేధిత డ్రగ్స్ కేసుల విచారణకు ఉపయోగపడే హ్యాండ్ బుక్ మాన్యువల్‌ను విడుదల చేసి అందజేశారు. కమిషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. నిషేధిత మత్తు పదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడ పురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ రవాణా, వినియోగం అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

- చెక్ పోస్టుల వద్ద క్రమం తప్పకుండా చేస్తున్న తనిఖీలతో పాటు, ప్రత్యేక ఎస్‌ఓటీ బృందాలు ఏర్పాటు చేసి చేపడుతున్న ఆపరేషన్ల ద్వారా ఎన్నో గంజాయి, ఓపియం, హెరాయిన్ వంటి ఇతర నిషేధిత డ్రగ్స్ సరఫరా ముఠాలను పట్టుకుని కేసులు నమోదు చేశామని వివరించారు.
- డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలను అణచివేయాలని, వారి మీద పీడీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. తెలిసీ తెలియక మత్తు పదార్థాల భారిన పడటం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందన్నారు.
- యువత శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని, నిషేధిత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావొద్దని సూచించారు.
- మత్తు పదార్థాల రవాణాపై ఎన్నో దాడులు చేస్తున్నామని, ఎంతో మందిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
- యువతలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల పట్ల అవగాహన కల్పించేలా కళాశాలల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మల్కాజిగిరి డీసీపీ జానకి, ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఎస్‌ఓటీ డీసీపీ గిరిధర్, ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీని కలిసిన రంగారెడ్డి జిల్లా జడ్జిలు..



జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జిలు శశిధర్‌రెడ్డి, పట్టాభిరామారావు

నాగోలు: రాచకొండ పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న సుధీర్ బాబును సోమవారం రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి శశిధర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభిరామారావులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాచకొండ పరిధిలో డ్రగ్స్ సరఫరా, వినియోగం మీద తీసుకుంటున్న చర్యల గురించి చర్చించారు.

నేటి నుంచి దత్తాత్రేయస్వామి జయంత్యుత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని అలకాపురిలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో నేటి నుంచి ఈనెల 26 వరకు శ్రీగురు దత్తాత్రేయ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శృంగేరి శంకరమఠం బ్రాంచ్ హెడ్ కేవీ శ్రీనివాస్ ప్రకటించారు. రోజూ దేవాలయంలో సామూహిక నవమ సప్తాహ శ్రీ గురుచరిత్ర పారాయణం, శ్రీదత్త భావసుధారస స్తోత్రం, ఘూర కష్టోద్ధారణ స్తోత్రం, సిద్ధమంగళ స్తోత్ర పారాయణం, మంగళవారం ఉదయం గణపతిపూజ, విశేష మండప ఆరాధన, అర్చన, స్వామివారి పాదుకులకు సహస్రనామార్చన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

బీఎల్‌ఓలకు శిక్షణా తరగతులు



డీసీ జయంత్

చాదర్‌ఘాట్: హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు నమోదుకు బూత్‌స్థాయి అధికారులకు నేటి నుంచి మూడ్రోజుల పాటు ట్రైనింగ్ ఇస్తున్నట్లు మలక్‌పేట సర్కిల్-6 ఎన్నికల అధికారి జయంత్ తెలిపారు. సోమవారం మలక్‌పేటలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 300 మంది బీఎల్‌ఓలకు ట్రైనింగ్ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఓటరు నమోదు, షిఫ్టెడ్ ఓటరు, డూప్లికేట్ ఓటరు తదితర విషయాలపై ట్రైనింగ్ ఇస్తున్నట్లు వివరించారు. 30 మంది సూపర్‌వైజర్లు, 10 మంది ఏఈఆర్‌ఓలు పనిచేస్తున్నట్లు చెప్పారు. 10 మంది బీఎల్‌ఓలకు ఒక సూపర్‌వైజర్ ఉంటారని, ఆ సూపర్‌వైజర్లకు 10 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు కో- ఆర్డినేట్ చేస్తారని పేర్కొన్నారు. బీఎల్‌ఓలకు సైదాబాద్‌లోని పద్మావతి కల్యాణ మండపంలో ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఉంటుందన్నారు. బూత్‌లెవల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓటరు నమోదు చేయాలని వారికి సూచించామని స్పష్టం చేశారు.

ఆధార్ కేంద్రానికి క్యూ..



మూసారంబాగ్ మెట్రోస్టేషన్ వద్ద..

మలక్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలలో ఒకటైన రూ. 500లకే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ పథకం కోసం ఆధార్ నమోదు కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరారు. ఈ క్రమంలో గ్యాస్ ఏజెన్సీల దగ్గర కేవైసీ అప్‌డేట్‌లో బయోమెట్రిక్, ఆధార్ డేటాలో సమస్యలు తలెత్తడంతో సోమవారం మూసారంబాగ్ మెట్రోస్టేషన్ ఆధార్ కేంద్రం వద్ద ప్రజలు క్యూ కట్టారు. బయోమెట్రిక్, ఐరీస్‌ని ఆధార్ డేటాలో అప్డేట్ చేసుకోవడానికి ఎగబడుతున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటోనగర్ కెమికల్ దుర్వాసన నిర్మూలనకు చర్యలు



ఆటోనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నర్సింహ్మారెడ్డి

ఎల్‌బీనగర్: కెమికల్ దుర్వాసన నిర్మూలన కోసం పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటి ద్వారా దుర్వాసన వస్తుందని మన్సురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. సోమవారం మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్ డంపింగ్‌యార్డు ప్రాంతం నుంచి వస్తున్న కెమికల్ దుర్వాసన నేపథ్యంలో ఆ ప్రాంతంలో పర్యటించి టీఎస్‌ఐఐసీ అధికారులతో కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆటోనగర్‌లోని డంపింగ్‌యార్డు రోడ్డులో ఉన్న డిస్మెంటల్ వ్యర్థాలను చెత్తాచెదారాలను లిఫ్ట్ చేయిస్తామని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



విజయభాస్కర్‌రెడ్డి



అమర్‌నాథ్‌యాదవ్

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్‌కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్‌యాదవ్ ,కోశాధికారిగా రాహుల్‌సాగర్‌లను ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా వి.రవీందర్ రెడ్డి, ఆర్.విష్ణువర్ధన్, జి.లాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా మల్లేపల్లి ప్రవీన్‌రెడ్డి, బద్రి, సాంస్కృతిక కార్యదర్శులుగా ఎస్.కృష్ణ, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా కాలనీ అధ్యక్ష,కార్యదర్శులుగా ఎన్నికైన భాస్కర్‌రెడ్డి, అమనాథ్‌యాదవ్ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి తమ శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు

మీర్‌పేట: శ్రీ సుబ్రమణ్య షష్ఠి సందర్భంగా శివసాయినగర్ కాలనీలోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత లక్ష్మీగణపతి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో నాగదేవతలకు అభిషేకం, అర్చనలు నిర్వహించారు. పూజలో వేదపండితులు శ్రీకాంతశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీగణపతి రావు, నర్సింహమూర్తి, రంగనాథ్, బాపిరాజు, గంగా రామకృష్ణ, ఆలయ చైర్మన్ సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

ఉప్పల్: చిలుకానగర్ బాలాజీ ఎన్‌క్లేవ్‌లో రూ.17 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సోమవారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను కోరారు. నాణ్యత విషయంలో రాజీపడేది లేదని అధికారులకు సూచించారు. చిలుకానగర్ డివిజన్‌ను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

చాంద్రాయణగుట్ట: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఆట బొమ్మల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బీబీ కా చష్మా రోడ్డులో మహ్మద్ గౌస్ అనే వ్యక్తి ఆట బొమ్మల విక్రయ దుకాణాన్ని నడుపుతున్నాడు. సోమవారం ఉదయం విద్యుదాఘాతం కారణంగా మంటలంటుకున్నాయి. ఈ మంటలలో దుకాణంలోని వస్తువులు కాలిపోయాయని.....రూ. 5 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో..) టమోటా రూ.21, వంకాయ 45, బెండకాయ 55, పచ్చిమిర్చి45, కాకరకాయ 55, బీరకాయ 50, కాలిఫ్లవర్ 28, క్యాబేజీ 15, క్యారెట్ 31. దొండకాయ 60, ఆలుగడ్డ 23, ఉల్లిగడ్డ 29, గోకరకాయ 50, దోసకాయ రూ.28, సొరకాయ 15, పొట్లకాయ 13, అరటికాయ 09, చిక్కుడుకాయ 65, అర్వి 45, మునగ 85, చిలగడదుంప 45, బీట్‌రూట్ 28, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 50, కాప్సికమ్ రూ.65 గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవం సోమవారం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య కుటుంబ సభ్యులు సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా వీధి వ్యాపారాలు





వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచన

నాగోలు: కొత్తపేట రైతుబజార్ సర్వీస్ రోడ్డులో విధి వ్యాపారులు ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వీధి వ్యాపారులకు సూచించారు. సోమవారం ఆయన ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డితో కలిసి కొత్తపేటలో పర్యటించారు. సందర్భంగా మాట్లాడుతూ.. వీధి వ్యాపారులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ విషయంలో ప్రజలు పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేస్తే స్థానిక పోలీసులు మీ మీద చర్యలు తీసుకుంటారని వ్యాపారులకు చెప్పారు. ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, కొత్తపేట రైతుబజార్ ఈ.ఓ. స్రవంతి, బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీసెల్ చైర్మన్ జోగు రాములు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి: ప్రజలు, ట్రాఫిక్‌కు అడ్డంకులు కలిగించకుండా తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తపేట రైతుబజార్ సమీపం ప్రాంతాల్లో ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. అనంతరం తోపుడు బండ్ల వ్యాపారులతో సమావేశమై వారికి కొన్ని సూచనలు చేశారు. రైతుబజార్ ముందు సర్వీస్ రోడ్డుపై వ్యాపారాలు కొనసాగించటం వల్ల జరిగే ఇబ్బందుల గురించి ప్రజలు పోలీస్ కంట్రోల్‌రూంకు సమాచారమిస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజలకు, వాహన రాకపోకలకు ఇబ్బందులు కలిగించకుండా క్రమపద్ధతిలో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, రైతుబజార్ ఈఓ స్రవంతి తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలలో మురుగు పారిశుద్ధ్య నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం వాటర్‌వర్క్స్ జీఎం ఖాదర్ మొయినుద్దీన్, ఏఈ శ్రావణ్‌కుమార్‌లను వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సైదాబాద్ డివిజన్‌లో మురుగు పారిశుద్ధ్య నిర్వహణకు మినీ ఎయిర్‌టెక్ వాహనాన్ని కేటాయించాలని కోరారు. శంకేశ్వరబజార్‌లోని క్వార్టర్స్‌లో నూతన సెవరేజ్ పైపులైన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ వివరించారు.


పర్వదినాల వేడుకలతో సోదరభావం



క్రిస్మస్ వేడుకల్లో విద్యుత్ అధికారులు, కార్మికులు

సైదాబాద్: కులమతాలకు అతీతంగా పర్వదినాల వేడుకలు నిర్వహించడం ద్వారా ఉద్యోగులు, కార్మికుల్లో సోదరభావం పెరుగుతుందని గ్రేటర్ హైదరాబాద్ సౌత్ సర్కిల్ సూపరింటెండెంట్ (ఇంజినీర్ ఆపరేషన్) ఖాజా అబ్దుల్ రహ్మాన్ అన్నారు. సోమవారం ఆస్మాన్‌ఘడ్‌లోని సిటీ-8 విద్యుత్ డివిజనల్ కార్యాలయ ఆవరణలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు, కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులు కార్మికులు కలిసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాక్‌చర్చి మన్నా మినిస్ట్రీస్ బిషప్ తిమోతి మాట్లాడుతూ.. సకల మానవాళి శ్రేయస్సు కోసం ఏసుక్రీస్తు జన్మించారని, ఆయన బోధనలు క్రైస్తవ సమాజానికి దిక్సూచి అని పేర్కొన్నారు. ఆస్మాన్‌ఘడ్ డీఈ హనుమంత్‌రెడ్డి, చంపాపేట డీఈ సురేష్, జేఏఓ విజయ్, సబ్ ఇంజినీర్లు అశోక్, విజయ్, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, జయపుత్ర, సులేమాన్, షరీఫ్ పాల్గొన్నారు.

పార్కుల్లో ఆక్సిజన్ మొక్కలు పెంచాలి



చిత్రా లేఅవుట్ కాలనీ పార్క్‌లో చీఫ్ హార్టికల్చర్ అధికారి సునంద

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రా లేఔట్ కాలనీ పార్క్‌లో జీహెచ్ఎంసీ చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ) సునంద పర్యటించారు. ఆమె మాట్లాడుతూ.. పార్క్‌లో నిరుపయోగంగా ఉన్న స్థలంలో ఆక్సిజన్ పెంచే మొక్కలు పెంచాలని వాటికి ఎంత నిధులు అవసరమవుతాయో.. నివేదిక సమర్పించాలన్నారు. పార్క్‌లో శునకాల సంచారాన్ని నివారించి, మొక్కల సంరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలని కోరారు. పార్కులో పర్యావరణ బెంచీలను ఏర్పాటు చేయాలని సర్కిల్ అధికారులకు సూచనలు చేశారు. డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, చిత్రా లేఅవుట్ కాలనీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, కాలనీ ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, ఎల్‌బీనగర్ సర్కిల్ హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రావు, మేనేజర్ సత్యనారాయణ, పావని పాల్గొన్నారు.

వీరభద్ర స్వామివారి కల్యాణం



కల్యాణోత్సవంలో కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేటలోని ఏపీఆర్‌గార్డెన్‌లో సోమవారం వీరభద్రస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వీరభద్ర స్వామివారి కల్యాణ వేడుక కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మురికివాడల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి

చిల్డ్రన్ పార్లమెంట్ తీర్మానం

రామంతాపూర్: గ్రేటర్ హైదరాబాద్ మురికివాడల పిల్లల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మౌంట్‌ఫోర్టు సోషల్ ఇనిస్టిట్యూట్‌లో నగరంలోని 30 మురికివాడలకు చెందిన 1200 మంది పిల్లలతో చిల్డ్రన్ పార్లమెంట్ నిర్వహించారు. ఇందులో ప్రధానమంత్రిగా అమూల్య, స్పీకర్‌గా శ్రీరామ్, ఉప ప్రధానిగా విక్రమ్ కుమార్‌తో కూడిన ఈ బాలల పార్లమెంట్‌లో మురికివాడల్లో తాగునీటి వసతి కల్పించడమే కాకుండా పారిశుద్ధ్యం, భూగర్భ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానించారు.

పద్యార్చన పోటీలు అభినందనీయం

మీర్‌పేట: మీర్‌పేట గాయత్రినగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సోమవారం 'తానా అమ్మానాన్న గురువు పద్యార్చన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ.. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), వంద దేశాల్లో వందకు పైగా తెలుగు సంఘాలు సంయుక్తంగా వందేవిశ్వమాతరం పేరుతో శాంతి సద్భావన యాత్రలో భాగంగా తమ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవాన్ని పెంచుతాయని అన్నారు. అనంతరం చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం, నాన్న శతకం, గురువు శతకాల్లోని పద్యాలను విద్యార్థులతో కంఠస్థం చేయించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



యాదగిరిగౌడ్ (ఫైల్)

హయత్‌నగర్: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని లారీ వెనక నుంచి ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం పస్మాముల గ్రామానికి చెందిన గూడెపు యాదగిరిగౌడ్ (50) ఆటోనగర్‌లోని వరుణ్ మోటార్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధులకు వెళ్లే క్రమంలో ఆదివారం రాత్రి తన బైకుపై బయలుదేరాడు. ఈ క్రమంలో హయత్‌నగర్ బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ లారీ ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో బైకుపై వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం

కళ్యాణమస్తు చారిటబుల్ ట్రస్టు

ఉప్పల్: ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిలుకానగర్ డివిజన్ కళ్యాణపురి కమ్యూనిటీ హాల్‌లో దివ్యాంగుల కళ్యాణమస్తు కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేడీ ఫౌండేషన్ కార్యదర్శి కవితారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. దివ్యాంగుల కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. దివ్యాంగులకు ఎలాంటి అవసరాలు ఉన్నా కళ్యాణమస్తు చారిటబుల్ ట్రస్టును సంప్రదించాలని తెలిపారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరికీ అండగా ఉంటామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఛాయాదేవి, బండి బాలరాజ్, శ్రీవల్లి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లోని సలీంఖాన్ కమ్యూనిటీహాల్‌లో సోమవారం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో చేపట్టిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పేదలకు సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు మరిన్ని ముందుకు రావాలన్నారు. డాక్టర్లు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి తగిన సలహాలు సూచనలు చేశారు. జనహిత సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నాల్గోసారి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా బలాలను సన్మానించారు. షఫర్డ్ ఎన్‌జీఓ ప్రతినిధి డాక్టర్ సురేష్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పర్వేజ్ హబీబ్ ఉర్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి తౌసీఫ్ మోహినుద్దీన్, ఎంఐఎం మహిళా విభాగం అధ్యక్షురాలు నజీమా తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు నిరంతరం ఫాగింగ్



మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణ

నాగోలు: దోమల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా నిరంతరం కాలనీల్లో ఫాగింగ్ చేయాలని ఎంటమాలాజీ అధికారులు, సిబ్బందికి నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్‌యాదవ్ సూచించారు. సోమవారం నాగోలు డివిజన్ వార్డు కార్యాలయంలో ఎంటమాలజీ, అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ.. నాగోల్ డివిజన్‌లో దోమలతో పరిసర ప్రాంత వాసులు అనారోగ్యానికి గురికాకుండా ఉండాలంటే రోజూ ఫాగింగ్ జరిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జలమండలి అధికారులు కాలనీవాసులకు క్రిమి కీటకాలు లేకుండా ప్రజలందరికీ స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. సీనియర్ ఎంటమాలజీ ఆఫీసర్ రజినీ, అసిస్టెంట్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

గుంతల్.. చింతల్ !

ఎల్‌బీనగర్: నియోజకవర్గ పరిధిలో పలు కాలనీల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం పాలకుల అలసత్వం తో రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. నాగోలు, మన్సూరాబాద్, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, తదితర శివారు డివిజన్లలో రోడ్లన్నీ అన్ని అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి గుంతలుగా మారిన రోడ్ల పైన దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



బండ్లగూడ రోడ్డు గుంతలుగా మారిన దృశ్యం



నాగోలు రోడ్డులో ఓ ఫంక్షన్‌హాల్ ఎదుట ఇలా..

భక్తిశ్రద్ధలతో కావడి మహోత్సవం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని శ్రీ బంగారు మైసమ్మ కాశీ విశ్వనాథ దేవాలయంలో సోమవారం వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి షష్ఠిని పురస్కరించుకుని కావడి మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో కావడి మోస్తూ సుబ్రమణ్యస్వామి మొక్కులు తీర్చుకున్నారు. కావడిలో పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, తేనె, జీడిపప్పు లాంటి ద్రవ్యాలతో కూడిన ప్రసాదాలను స్వామివారికి సమర్పించారు. వందలాదిమంది భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, ఆలయ ఫౌండర్ ట్రస్టీలు బాలకిషన్, అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

